# అసంపూర్ణ చిత్రం

ఓ రాత్రివేళ
అంతటా నిశ్శబ్దం
ఆక్సిజన్ లాగా ఆవరిస్తుంది.

వాయించని కంజరలాగా చంద్రుడు,
మోయించని మువ్వల్లాగా చుక్కలు
–ఆకాశం మౌనం వహిస్తుంది.

వీధిలైట్లన్నీ తలవంచుకొని,
ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉండిపోతాయి.

ఓ పిట్ట ఒంటరిగా –
దొంగతనానికి వెళుతున్నట్టుగా,
ఏమీ సద్దుచెయ్యకుండా
ఎగిరిపోతుంది.

అంతలో,
అంతటి మౌనాన్ని హఠాత్తుగా ప్రశ్నిస్తూ,
నిశ్చలమైన చెరువులో నీటిబొట్టుపడ్డట్టుగా,
ఓ పసిపాప ఏడుస్తుంది!

చిట్టచివరకి, ఏడుపవగానే,
చుట్టూ పరుచుకున్న మౌనం
ఎంత గాఢమయ్యిందీ అర్థమౌతుంది.

ఇంక ఊరుకోలేని చెట్టు
గాలికోసం కేకేస్తుంది.

ఆకాశంలో మబ్బులు
- నా మనసులాగే,
అసంతృప్తిగా,
అసంపూర్ణ చిత్రాలు గీస్తూ,
ఆగిపోతాయి.

జూలై, 82